తొలి క్రాంతి NEWS

https://www.tholikranthidaily.in TEL TEL - 12281

# తొలిక్రాంతి

మన గొంతుకకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక..

హైదరాబాద్
మంగళవారం
29-4-2025
వెల రూ. 4/-
పేజీలు : 04

Published From : Hydarabad Editor : Malothu Chandrakala

# తిరిగి అధికారంలోకి రానున్నాం

- వరంగల్ సభకు లక్షలాదిగా తరలి వచ్చిన తెలంగాణ ప్రజలు చెప్పిన సందేశం ఇదే
- భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు
- రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలను అన్యాయాలను మరింతగా ఎండగడతాం
- పార్టీ శ్రేణులకు, నాయకులకు ధన్యవాదాలు
- పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2





# ఆపరేషన్ కగార్ ఆపాల్సిందే

- తక్షణమే మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి
- రాజకీయ పార్టీలతో మాట్లాడి ప్రభుత్వం సలహాలు సూచనలు తీసుకోవాలి
- కేవలం చర్చల ద్వారానే శాంతిని నెలకొల్పడం సాధ్యం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల

2

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాల్సిందే తక్షణమే మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ముందుకు రావాలని చెప్పారు. మావోయిస్ట ప్రభావిత రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి ప్రభుత్వం సలహాలు సూచనలు తీసుకోవాలని కేవలం చర్చల ద్వారానే శాంతిని నెలకొల్పడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.



# కేసీఆర్ స్పీచ్‌లో పస లేదు

- అధికారం పోయింది అనే బాధతో మాట్లాడినట్టు ఉంది కేసీఆర్ స్పీచ్
- సభలో కేసీఆర్ తన అక్కసు మొత్తం కక్కాడు
- పిల్లలను కేసీఆర్ ఎందుకు అసెంబ్లీకి పంపుతున్నాడు?
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలులో లేవు
- నాకు రాహుల్ గాంధీకి మధ్య మంచి రిలేషన్ ఉంది
- సీఎం రేవంత్ రెడ్డి

2

కేసీఆర్ అభద్రతా భావంలో అక్కసు వెల్లగక్కారు. ఆయన స్పీచ్ లో పస లేదు. కక్ష సాధింపు చర్యలకు నేను దగనని కేటీఆర్ పై కేసు అయినా.. ఫోన్ ట్యాపింగ్ కేసు అయినా.. అన్నీ చట్ట పరిధిలోనే జరుగుతాయి



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):బీఆర్ఎస్ ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలకు కేసీఆరే కారణం అని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ రాష్ట్ర ఖజానా అంతా ఖాళీ చేసి ఇప్పుడు మాపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ జానారెడ్డి నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అక్కడ జానారెడ్డి, కేకే, వేం నరేందర్ రెడ్డితో కలిసి నిన్న శాంతి కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు, అపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణపై చర్చించారు.

## రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్

2



- తెలంగాణ ఫస్ట్ అండ్ చివరి విలన్ కేసీఆర్
- టైం వేదిక మీరే డిసైడ్ చేయండి..చర్చకు ఎక్కడికి రమ్మన్నా వస్తా
- ఫాం హౌస్ దాటి వచ్చే దమ్ముందా కేసీఆర్?
- వక్ఫ్ చట్టంపై కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

## కేసీఆర్ గతాన్ని మర్చిపోయారా?



- రాహుల్ గాంధీపై మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు
- రాహుల్ గాంధీ కుటుంబానికి ఓ గొప్ప చరిత్ర ఉంది
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

2

## రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిండ్రు



- కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని దివాలా తీశారు
- కమీషన్ కక్కుర్తి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లోపించింది
- కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలోనే కూలిపోవడం దారుణం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## వీలైనంత త్వరగా పనులు చేపట్టాలి

- నష్టం ప్లాంట్ సాధారణ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది
- మరమ్మతు పనులను 7 నుంచి 10 రోజులలో సమాంతరంగా చేపట్టవచ్చు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



## భూభారతి దేశానికే రోల్ మోడల్

- ప్రయోజనాలు ప్రజలకు చేరినప్పుడే దానికి పూర్తి సార్థకత లభిస్తుంది
- మంత్రి కొండా సురేఖ

2



## బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు

- 110కి పైగా చిత్రాల్లో నటన, సేవా కార్యక్రమాల ఘనతకు గౌరవం
- బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్‌గా సేవలకూ గుర్తింపు

2



తొలిక్రాంతి
మంగళవారం
29 ఏప్రిల్ 2025

## ఆపరేషన్ కగార్ ఆపాల్సిందే

**- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాల్సిందే తక్షణమే మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ముందుకు రావాలని చెప్పారు. మావోయిస్ట ప్రభావిత రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి ప్రభుత్వం సలహాలు సూచనలు తీసుకోవాలని కేవలం చర్చల ద్వారానే శాంతిని నెలకొల్పడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కాల్పులతో మావోయిస్టులను అంతం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వపు విధానం సరికాదని సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతి చర్చలు నిర్వహించాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ హయాంలో 3,500 మంది నక్సలైట్లు సరెండర్ అయ్యారని, కేసీఆర్ గారు తీసుకున్న విధానపరమైన నిర్ణయాల వల్ల చత్తీస్ ఘడ్ నుంచి వచ్చి కూడా తెలంగాణలో నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిశారని గుర్తు చేశారు. కేసీఆర్ విధానాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలని, సరెండర్లను ప్రోత్సహించి వారికి జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. పోలీసులు, మావోయిస్టుల మధ్య ఆదివాసీలు నలిగిపోతున్నారని, ఎవరు చనిపోయినా మన దేశ పౌరులే కాబట్టి కేంద్రం చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.

## కేసీఆర్ గతాన్ని మర్చిపోయారా?

**- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



హైదరాబాద్ ఏప్రిల్28(తొలి క్రాంతి):పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్ తన గతాన్ని మర్చిపోయి మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని వ్యాఖ్యానించారు.గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, నిన్న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభలో కేసీఆర్ "డూప్లికేట్ గాంధీలు" అంటూ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వయసులో పెద్దవారి అయిన కేసీఆర్ మాట్లాడే ముందు ఆచితూచి మాట్లాడాలని హితవు పలికారు.రాహుల్ గాంధీ కుటుంబానికి ఓ గొప్ప చరిత్ర ఉందని ఆ కుటుంబంపై కేసీఆర్ అనవసరంగా విమర్శలు చేయడం వల్ల తనకు ఉన్న కొద్దిపాటి గౌరవాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.రాష్ట్ర విభజన జరగాలని రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఇళ్ల చుట్టూ తిరిగిన రోజులను కేసీఆర్ మర్చిపోయారా అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం నెలల తరబడి ఢిల్లీలో ఎదురు చూసిన రోజులు గుర్తు చేశారు.రాష్ట్ర విభజనకు ముందు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ "ఒరిజినల్ గాంధీలు" కాగా ఇప్పుడు మాత్రం "డూప్లికేట్ గాంధీలు"గా అభ్యంతరించడం సరికాదని చెప్పారు. ఇదేనా కేసీఆర్ నేర్చుకున్న రాజకీయ విలువలని ప్రశ్నించారు.రాజకీయాల్లో హీరోలు, విలన్లు అన్నీ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటాయని ప్రజల కోసం హీరో పాత్రలో కూడా ప్రతిపక్షాల పాలిట విలన్ పాత్రలో కూడా కాంగ్రెస్ ఉంటుందని జగ్గారెడ్డి అన్నారు.



## రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిండ్రు

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):

నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.ఓ కుటుంబం పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ఆరోపించారు. కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని దివాలా తీశారని మండిపడ్డారు.సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి బీఆర్ఎస్ నేతలు తమ జేబులు నింపుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల కమీషన్ కక్కుర్తి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లోపించిందని తీవ్ర విమర్శలు చేశారు. రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలోనే కూలిపోవడం దారుణమని తెలిపారు.మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించినా పనికిరావని ఎన్ఎస్‌డీఏ నివేదికలో తేలిందని గుర్తుచేశారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా అదనంగా ఒక్క ఎకరమైనా సాగులోకి రాలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దోపిడీ విధానంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు.పాలమూరు-రంగారెడ్డి, డిండి, సీతారామ ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళలు ఇలా అన్ని వర్గాలను కేసీఆర్ ప్రభుత్వం వేధించిందని మండిపడ్డారు.కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకుని కేసీఆర్ రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం కృష్ణా జలాల్లో తెలంగాణకు 500 టీఎంసీలు కేటాయించేందుకు పోరాటం చేస్తున్నదని వెల్లడించారు.పదేళ్లు అధికారంలో ఉన్నా ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని, ఉన్న రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.

## బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు

న్యూ ఢిల్లీ ఏప్రిల్28(తొలి క్రాంతి): 2025 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా సినిమా రంగానికి గాను విశేష సేవలు అందించిన ప్రముఖులకి ప్రతిష్టాత్మక అవార్డులు అందించారు. ప్రముఖ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ 'పద్మభూషణ్' అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా బాలయ్య పద్మ అవార్డుల కార్యక్రమానికి హాజరయ్యారు. కొడుకు, కూతుళ్లు, అల్లుళ్లతో కలిసి బాలయ్య ఈ కార్యక్రమానికి హాజరు కావడం విశేషం.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎంపికైన బాలయ్య, రాష్ట్రపతి ముర్మ చేతుల మీదుగా దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారాన్ని స్వీకరించారు. 110కి పైగా చిత్రాల్లో నటించడంతో పాటు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్‌గా కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న క్రమంలో బాలయ్యకి ఈ అవార్డ్ దక్కింది. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి కుమారుడు మోక్షజ్ఞ, కూతురు తేజస్విని, భార్య వసుందర, మంత్రి నారా లోకేష్ దంపతులు హాజరయ్యారు.కోలీవుడ్ హీరో అజిత్‌కి సైతం పద్మ విభూషణ్ అవార్డ్ అందించారు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ.

# తిరిగి అధికారంలోకి రానున్నాం

**- పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సందర్భంగా వరంగల్‌లో జరిగిన బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కేటీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.లక్షల సంఖ్యలో ప్రజలు సభకు హాజరై, కేసీఆర్ నాయకత్వం పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించారని కొనియాడారు. సభ ద్వారా భారత రాష్ట్ర సమితి మరోసారి అధికారంలోకి రాబోతోందని స్పష్టమైందని అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద బహిరంగ సభల్లో ఒకటిగా ఈ రజతోత్సవ సభ నిలిచిపోతుందని కేటీఆర్ తెలిపారు. భారత రాష్ట్ర సమితి ప్రజా బలాన్ని ఈ సభ మరోసారి నిరూపించిందని గర్వంగా పేర్కొన్నారు. ట్రాఫిక్ నిర్వహణలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం విఫలమైనప్పటికీ లక్షలాది మంది ప్రజలు ముందే సభ ప్రాంగణానికి చేరుకోవడం తెలంగాణ ప్రజల నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. భారీ ట్రాఫిక్ సమస్యలు ఉన్నప్పటికీ, సభ విజయవంతంగా పూర్తి కావడం గర్వకారణమని పేర్కొన్నారు. జరిగిన ఈ సమావేశం రజతోత్సవ సమావేశాల కార్యక్రమాలకు కేవలం ప్రారంభం మాత్రమేనని ఆయన తెలిపారు. కేసీఆర్ స్వయంగా "నేనే ముందుండి పోరాడతాను" అని ప్రకటించడంతో భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే తగిన సమయం ఇచ్చామని ఇకపై ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేటీఆర్ అన్నారు. ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రభుత్వ వైఫల్యాలను, దోపిడీ చర్యలను మీడియా ద్వారా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే అరాచకాలను, వారి ప్రచారాలను ఎక్కడికక్కడ ఎదుర్కొని ప్రజల్లో స్పష్టత తీసుకురావాలని, మరింత చురుకుగా ముందుకు సాగాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.రాష్ట్ర పార్టీ నాయకులతో పాటు పార్టీ శ్రేణులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున స్పందించి సభ విజయవంతం కావడంలో మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రత్యేక కృషి చేసిన వరంగల్ జిల్లా పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో పాటు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే పార్టీ కార్యకర్తలకు కూడా కేటీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సభా ప్రాంగణం వద్ద గత నెల రోజులుగా నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగా ఈ సభ ఎంతో విజయవంతంగా జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. నాయకులందరి నిబద్ధత, కృషి వల్లనే ఇంత భారీ సభ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముగిసిందని ప్రశంసించారు. స్థానిక శాసనసభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, జిల్లా అధ్యక్షుల సమన్వయంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతి కార్యకర్త సురక్షితంగా తమ ఇండ్లకు చేరుకున్నారని ఇందుకోసం శ్రమించిన ప్రతి నాయకునికి కార్యకర్తకు కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు ప్రతి ఒక్కరూ సభ విజయవంతం కావడానికే పని చేశారని కేటీఆర్ అభినందించారు. ఈ భారీ బహిరంగ సభను పక్కా ప్రణాళికతో, ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతం చేయగలిగామని పేర్కొన్నారు. సభ విజయవంతం కావడానికి కృషి చేసిన భారత రాష్ట్ర సమితి నాయకులకు, పార్టీ శ్రేణులకు, దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించిన సీనియర్ నాయకులకు, సోషల్ మీడియా వారియర్లకు కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వీరందరి కృషితో ఈ చారిత్రాత్మక సభ మరువలేని ఘట్టంగా నిలిచిందని చెప్పారు. అదేవిధంగా, మంచి కవరేజ్‌తో సభా కార్యక్రమాలను ప్రజలకు అందించిన మీడియా మిత్రులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కేసీఆర్ స్పీచ్ లో పస లేదు

**- సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):బీఆర్ఎస్ ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలకు కేసీఆరే కారణం అని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ రాష్ట్ర ఖజానా అంతా ఖాళీ చేసి ఇప్పుడు మాపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ జానారెడ్డి నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అక్కడ జానారెడ్డి, కేకే, వేం నరేందర్ రెడ్డితో కలిసి నిన్న శాంతి కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు, అపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణపై చర్చించారు. అనంతరం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ముఖ్యమంత్రి.. నిన్న బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ అభద్రతా భావంలో అక్కసు వెల్లగక్కారని ఫైర్ అయ్యారు. ఆయన స్పీచ్ లో పస లేదన్నారు కక్ష సాధింపు చర్యలకు నేను దగనని కేటీఆర్ పై కేసు అయినా.. ఫోన్ ట్యాపింగ్ కేసు అయినా.. అన్నీ చట్ట పరిధిలోనే జరుగుతాయని చెప్పారు. కేసీఆర్ లాగా నేను చట్టాన్ని అతిక్రమించి అరెస్టు చేయించనన్నారు. కేసీఆర్ సభకు ఎన్ని బస్సులు అడిగితే అన్ని ఇచ్చాం. గతంలో ఆర్టీసి కూడా ఆదాయం వచ్చిందన్నారు. గతంలో బీఆర్ఎస్ హయంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వమంటే ఇవ్వకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అవసరాలకు అనుగుణంగా కేసీఆర్ మోడీ మాటలు మారుస్తున్నారని మండిపడ్డారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలని, రెండు దేశాలను ఓడించిన ఘనత ఇందిరాగాంధీదేనన్నారు.మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తాని సీఎం చెప్పారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కేకే పార్టీలో చర్చిస్తారు. గతంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపింది ఈ ఇద్దరనేనని చెప్పారు. ఇప్పుడు కూడ ఆ వ్యవహారం అంతా జానారెడ్డి, కేకే చూస్తారని చెప్పారు. ఆపరేషన్ కగార్ పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని అధిష్టానానికి పీస్ కమిటీ ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు.దీనిపై మా పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వ విధానం ప్రకటిస్తామన్నారుఎమ్మెల్యేలు హైదరాబాద్ లో టైమ్ పాస్ చేయడం సరికాదని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీలో ఓపిక ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నష్టపోతారు. రాహుల్ గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం అని మా ఇద్దరి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఎవర్నీ నమ్మించాల్సిన పని లేదన్నారు. బయట ఎవరు ఏమనుకున్నా నేను పట్టించుకోనని చెప్పారు.

## రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్

**- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ రజతోత్సవ సభను అట్టర్ ఫ్లాప్ అయ్యిందని విమర్శించారు. తెలంగాణ ఫస్ట్ అండ్ చివరి విలన్ కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగంలో పసలేదని, ఆయన శకం ముగిసిందని అన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ, "టైం వేదిక మీరే డిసైడ్ చేయండి.. చర్చకు ఎక్కడికి రమ్మన్నా వస్తా. ఫాం హౌస్ దాటి వచ్చే దమ్ముందా కేసీఆర్?" అంటూ సవాల్ విసిరారు.రజతోత్సవ సభలో జనాల కంటే విస్కీలు ఎక్కువగా కనిపించాయని, సభలో మహిళలే లేరో అన్నట్టుగా విమర్శించారు. కేసీఆర్ దేశం కోసం ప్రాణాలు, ఆస్తులు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని 'నకిలీ గాంధీలు' అంటున్న దుస్సాహసం చేశారని మండిపడ్డారు. దీని కోసం కేసీఆర్ తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.బీజేపీ బీఆర్ఎస్ మచ్చల్ని బయటపెడుతూ బీజేపీపై కేసీఆర్ చేసిన విమర్శలు నెమలి పింఛంతో కొట్టినట్టుగా ఉన్నాయన్నారు. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రపన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.కేసీఆర్‌ను గట్టిగా విమర్శించిన మహేష్ కుమార్ గౌడ్, "గాంధీ కుటుంబం పెట్టిన రాజకీయ భిక్షతో దొంగ పాస్ పోర్టుల బిజినెస్ చేసుకునే మీ కుటుంబం లక్షల కోట్లకు పడగలెత్తింది. తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలు ఇచ్చింది. కానీ మేము ఏడాదిలో 60 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం," అని వివరించారు.ముఖ్యమంత్రి అయ్యేంత బలం కూడా భిక్షతో సంపాదించినదే అంటూ కేసీఆర్‌ను ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి కేసీఆర్ గుండెల్లో గుబులు మొదలైందని, కేటీఆర్, హరీష్ రావు, కవితల ముక్కల ఆట వల్ల ఆయనకు మతి భ్రమ ఏర్పడిందని మండిపడ్డారు.

# భూభారతి దేశానికే రోల్ మోడల్

**- మంత్రి కొండా సురేఖ**



మెదక్ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.సోమవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లోని ఎస్ఎస్ఎస్ఆర్ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన భూభారతి అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఆమెతో పాటు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పాల్గొన్నారు.సదస్సు ప్రారంభానికి ముందు, దేశంలో తీవ్రవాద దాడులకు నిరసనగా రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి భూభారతి చట్టం అవగాహన సదస్సును ప్రారంభించారు. భూభారతి-నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు తెలిపారు. రైతులు, ప్రజల మేలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టానికి కృతజ్ఞతలు తెలిపారు.అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు ప్రజలకు చేరినప్పుడే దానికి పూర్తి సార్ధకత లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణను భూ సమస్యల నుండి విముక్తం చేసే లక్ష్యంతో భూభారతి చట్టాన్ని తెచ్చినట్లు తెలిపారు.భూభారతి చట్టం ధరణి స్థానాన్ని భర్తీ చేస్తూ కొత్త భూమి హక్కుల రికార్డు వ్యవస్థను తీసుకువచ్చిందని వివరించారు.ఈ చట్టంలోహక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం,రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ,పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం,వారసత్వ భూములకు విచారణ అనంతరం మ్యుటేషన్ చేసే అవకాశం ఉంది.రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంది.భూమి హక్కులకు ఆధార్‌తో అనుసంధానమైన భూధార్ కార్డులు జారీ చేస్తారని తెలిపారు.ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులను నమోదు చేస్తారని చెప్పారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం కూడా అందిస్తారని వివరించారు.గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా ప్రభుత్వ భూములు, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వర్ఫ్ భూముల పట్టాల మార్పుల రద్దుకు చట్టంలో వీలు కల్పించారని తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రైతులు ఈ చట్టం ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.త్వరలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమించనున్నట్లు కూడా మంత్రి తెలిపారు.

# వీలైనంత త్వరగా పనులు చేపట్టాలి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ ప్రతినిధి ఏప్రిల్28(తొలి క్రాంతి):ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టితో పాటు జెన్కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా, బీహెచ్ఈఎల్ సీఎండీ కే. సదాశివ మూర్తి, జెన్కో ఉన్నతాధికారులు, యాదాద్రి పవర్ ప్లాంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు డిప్యూటీ సీఎంకు ఇచ్చిన సమాచారం ప్రకారం, అగ్నిప్రమాదంలో కొన్ని కేబుల్స్, వాల్వులకు స్వల్ప నష్టం వాటిల్లింది. ముఖ్యంగా ఇంధనం ఆయిల్ లీకేజీనే అగ్నిప్రమాదానికి కారణమని గుర్తించారు. ప్రస్తుతం ఈ యూనిట్ బీహెచ్ఈఎల్ ఆధీనంలోని ట్రయల్ ఆపరేషన్ విభాగంలో ఉందని తెలిపారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో పూర్తి కాలేదని కూడా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు.డిప్యూటీ సీఎం అధికారులకు సూచిస్తూ వీలైనంత త్వరగా యూనిట్ మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. నేడు మంగళవారం నాటికే యూనిట్ పనులను పునఃప్రారంభించగలమన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ నష్టం ప్లాంట్ సాధారణ కార్యకలాపాలకు ఆటంకం కలిగించదని, మరమ్మతు పనులను 7 నుంచి 10 రోజులలో సమాంతరంగా చేపట్టవచ్చని బీహెచ్ఈఎల్ అధికారులు తెలిపారు అని డిప్యూటీ సీఎం వివరించారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఘన విజయం పట్ల మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు కృతజ్ఞతలు



ఖమ్మం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో ఎంతో వైభవంగా నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రజల అపార మద్దతుతో ఘన విజయం సాధించిందని, బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి సభలో పాల్గొనడం ద్వారా బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు ఉంచిన అపార నమ్మకాన్ని మరోసారి ప్రపంచానికి చూపించారని ఆయన పేర్కొన్నారు.సభ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శిల్పి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఇచ్చిన మార్గదర్శనం ప్రతి కార్యకర్తకు, నాయకుడికి కొత్త శక్తిని, ఉత్తేజాన్ని అందించిందని నామ నాగేశ్వర రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన నుంచి బీఆర్ఎస్ పాలనలోని పది సంవత్సరాల విజయగాథను సభలో స్మరించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ రజతోత్సవ సభ విజయవంతం కావడమే కాదు, భవిష్యత్తులో బీఆర్ఎస్ నాయకత్వంలో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజల మద్దతు స్పష్టంగా వ్యక్తమైందని నామ తెలిపారు. ఈ ఘన విజయానికి మూలమైన ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు, మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన గులాబీ శ్రేణులకు హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.ప్రత్యేకంగా, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయికి వరకు గట్టిగా పనిచేసిన కార్యకర్తలు, మహిళా విభాగం, యువజన విభాగం, ఇతర అనుబంధ సంఘాల ప్రతినిధుల కృషిని ఆయన అభినందించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) యువ, దూరదృష్టి నాయకత్వంలో ప్రజల ఆశయాలను నెరవేర్చడమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన లక్ష్యమని నామ హృదయపూర్వకంగా తెలిపారు."ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ మరింత బాధ్యతాయుతంగా ముందుకు సాగుతుంది. అభివృద్ధి, సంక్షేమం, సమాజ హితమే మా దీక్ష" అంటూ నామ నాగేశ్వరరావు సందేశం పంపారు.




## మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో, మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని, ఆదివాసీల హక్కులను పరిరక్షించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ ఆవునూరి మధు పాల్గొన్నారు.అదేవిధంగా, కాంగ్రెస్ పీసీసీ రాష్ట్ర నాయకులు నాగ సీతారాములు, సిపిఐ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కామ్రేడ్ సలివిడి శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ లిక్కి బాలరాజు, టీజేఎస్ రాష్ట్ర నాయకులు మల్లె రామనాథం, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ ఉపేందర్, ఐలు జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్, ఆల్ ఇండియా ట్రైబల్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ సూర్ణపాక నాగేశ్వరరావు, బీసీ సంఘం నాయకులు సైదుబాబు, ఎఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.వారు మాట్లాడుతూ,భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే, ఆదివాసీల హక్కులను కాలరాస్తూ, "ఆపరేషన్ కగార్" పేరుతో మావోయిస్టులను నిర్మూలించేందుకు తీవ్ర దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. మార్చి 2026 నాటికల్లా దేశం నుంచి నక్సల్స్ లేకుండా చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో, ఆదివాసి చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కొత్త అటవి సంరక్షణ నిబంధనలు తీసుకొచ్చి, కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపద అప్పగించేందుకు కుతంత్రాలు కొనసాగిస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కర్రెగుట్ట వంటి ప్రాంతాల్లో 89 రకాల ఖనిజ సంపద ఉన్నందున, కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సైనిక దాడులకు పాల్పడుతోందని, సుమారు 280 కిలోమీటర్ల పరిధి గల కర్రెగుట్టను లక్ష్యంగా చేసుకుని 25 లక్షల సైనిక బలగాలతో చుట్టుముట్టడాన్ని వారు ఖండించారు.సైనిక బలగాలను తక్షణమే వెనక్కి పిలిపించాలి, మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ఇప్పటికే ప్రకటించినందున, కేంద్రం చర్చలను ప్రారంభించి ప్రజాస్వామిక మార్గంలో సమస్యలను పరిష్కరించాలని నేతలు డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కులను పరిరక్షిస్తూ, వారి జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జె.సీతారామయ్య, వై.గోపాలరావు, పృథ్వి, మోత్కూరి మల్లికార్జునరావు, మంజుల, ఎట్టి ప్రశాంత్, అలీముద్దీన్, ప్రణయ్, కిరణ్, బుచ్చయ్య దొర తదితరులు పాల్గొన్నారు





## చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా ముగిసిన బిఆర్ఎస్ రజతోత్సవ సభ

కొత్తగూడెం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:చరిత్రలో లేనిది లాంటి విస్తృతమైన, ఆవేశభరితమైన రీతిలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ రజతోత్సవ బహిరంగ సభ విజయవంతంగా జరిగింది. లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ప్రత్యక్షంగా చూసేందుకు తరలివచ్చారు.ఈ సభను అపూర్వ విజయవంతం చేసినందుకు నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి , టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారు సోమవారం మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సభను విజయవంతం చేయడంలో తమ వ్యవసాయ భూములను అందించిన ఎల్కతుర్తి గ్రామ రైతులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సభ విజయవంతానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కార్యకర్తలను భారీగా సమీకరించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కృషిని వారు కొనియాడారు.అలాగే, గత 16 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించడంలో విఫలమైందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు మళ్లీ ఉద్యమ నాయకుడు, తెలంగాణ బాపు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.బిఆర్ఎస్ పరిపాలనలో అమలైన ఎన్నో సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో మూడు కూడా అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మళ్లీ బిఆర్ఎస్ ను బలపరిచి, కేసీఆర్ నేతృత్వాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు.చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, ప్రతి అభిమానికి, ప్రతి తెలంగాణ ప్రజకు కృతజ్ఞతలు తెలిపారు.

## మల్లెల సుబ్బారావు కు ఘన సన్మానం

కొత్తగూడెం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:కొత్తగూడెం జిఎం కార్యాలయంలో పదవి విరమణ సందర్భంగా జనరల్ మేనేజర్ (మెటీరియల్ ప్రొక్యూర్మెంట్) మల్లెల సుబ్బారావు కి ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానం చేశారు.జిఎం (ఎంపీ)గా సుబ్బారావు సంస్థకు చేసిన సేవలను జిఎం ఎం. షాలెం రాజు కొనియాడారు. కంపెనీలో వివిధ హోదాలలో ఆయన చేసిన కృషి మరువలేనిదని, భవిష్యత్తు జీవితం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.వి. కోటిరెడ్డి, ఎజిఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, ఎజిఎం (ఫైనాన్స్) కే. హన సుమలత, డీజీఎం(పర్సనల్) బి. శివకేశవరావు, ఇతర అధికారులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# సెలెక్షన్ లో గోల్ మాల్

- డబ్బున్న వాళ్ళకి ఇందిరమ్మ ఇండ్ల?
- మాకు ఇల్లు రాలేదు మేం కాంగ్రెస్ పార్టీకి చెందిన వాళ్ళం
- మాకు రావలసినటువంటి ఇల్లు కాంగ్రెస్ నేతలకు మంజూరు
- మహిళలు పెద్ద ఎత్తున లబోదిబో

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో ఏప్రిల్28(తొలి క్రాంతి):ఇందిరమ్మ కమిటీ సెలెక్ట్ చేసినటువంటి ఇందిరమ్మ గృహాల పేర్ల లొల్లి గల్లి గల్లీ లోను పట్టణాలలోనూ రచ్చ రచ్చ సాగుతున్నది. ప్రభుత్వము పేదవారికి ప్రభుత్వ గైడ్లైన్స్ ప్రకారం ఉన్నటువంటి వారికి నిరుపేదలకు మాత్రమే ఇల్లు కేటాయింపులు చేస్తామని స్వయంగా తెలంగాణ రాష్ట్రం మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానిస్తుండగా.. వారి వ్యాఖ్యలకు విరుద్ధంగా ఇందిరమ్మ గృహాల శాంక్షన్ లిస్టులు ఉన్నాయా అనే సందేహాలు ప్రజలలో వ్యక్తం అవుతున్నాయి. స్వయంగా మంత్రి.. అర్హత లేనటువంటి వారికి ఎవరైనా ఇందిరమ్మ కమిటీలో స్థానం కల్పిస్తే ఖచ్చితంగా కలెక్టర్ లేదా ఎమ్మెల్యే దగ్గరుండి పేర్లను తొలగిస్తారని కార్యకర్తలు ఎవరు నోచుకోవద్దని చెప్పకనే చెప్పుకొచ్చారు.**



అనేక గ్రామాలతో పాటు పట్టణాలలోనూ ప్రభుత్వము ఇచ్చిన హామీ ప్రకారం.. ప్రతి నిరుపేద గూడు లేనటువంటి నిరుపేదలకు ఇల్లు కల్పిస్తున్న హామీలో భాగంగా ఒక్కొక్క నియోజకవర్గానికి 3500 కేటాయించి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి ఇందిరమ్మ కమిటీలతోపాటు అధికారులను భాగస్వాములను చేసి కమిటీలే పూర్తి బాధ్యులుగా చేస్తూ పేరుకే అధికారులు ఉన్నట్టుగా కనిపిస్తున్నది. అనేక గ్రామాలలో పూర్తిస్థాయిలో ఇందిరమ్మ గృహాల మంజూరు పై రుసురుసలాడుతున్నది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాటు ప్రధానంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ నియోజకవర్గాలలోని వివిధ మండలాలలోని వివిధ గ్రామాలు గ్రామపంచాయతీల పరిస్థితులు, హస్తం పార్టీ నాయకులతోపాటు పేద సాదా బడుగు బలహీన వర్గాల ప్రజలు ఇల్లు రాక గ్రామాలలో కొందరికే ఇల్లు మంజూరై అదికూడా జెండా పట్టుకున్న వారికి భవంతులు డబ్బులు ఉన్నవారికి మంజూరు చేశారని విమర్శలు అనేక గ్రామల్లో పల్లెల్లో వినిపిస్తున్నాయి. పార్టీల రాజకీయాలలో పేదవారైనా బలి కావాల్సిందే. పార్టీ జెండా పట్టుకున్న వారికి పథకాలనే పరిస్థితుల్లో పార్టీల విధానాలు కనిపిస్తున్నటువంటి నేటి రోజులలో విధానాల ముసుగులోనే ఇందిరమ్మ కమిటీల నాయకుల వ్యవహార శైలి పేరు డబ్బున్న వాళ్ళకి ఇల్లు మంజూరన్నట్టుగా కనిపిస్తున్నది. ఎక్కడ చూసినా.. గ్రామాలలో ఇందిరమ్మ గృహాల రచ్చ రచ్చ కొనసాగుతున్నది. దీనికి తోడు వర్గాల లొల్లి సైతం గట్టిగానే రాజుకుంటుంది. ఒక వర్గం నేతలకి ప్రాధాన్యత దక్కుతుంది అంటూ కొన్ని నియోజకవర్గాలలో చర్చ గట్టిగానే కొనసాగుతున్నది.సెలెక్షన్ లో గోల్ మాల్ జరిగిందని హస్తం పార్టీ నేతలకి ప్రాధాన్యత ఇవ్వడం జెండా పట్టుకున్న వారికి ఇల్లు మంజూరైనట్టుగా చర్చలు జోరుగా సాగుతున్నాయి. మంజూరైన లిస్టులు సైతం ఎక్కడ కనిపించడం లేదు. కేవలం అధికారులను అడిగిన సమాధానం దాటవేస్తున్నారు. గ్రామస్థాయిలో ఉండేటటువంటి పంచాయతీ స్థాయిలో ఉండే అధికారులు సైతం ఎవరు అడిగిన మాకు ఏమీ తెలియదు అంతా ఇందిరమ్మ కమిటీని అడగండి అని చెప్పుకొస్తున్నారు. ఇందిరమ్మ కమిటీని అడిగితే అధికారులు అడగండి అని ఒకరి మీద.. ఒకరు చెప్పుకొని కాలయాపన చేస్తున్నారు. లిస్టులు తీసుకొని గ్రామాలలో అధికారులు పర్యవేక్షణకు వచ్చి పరిశీలన చేసేందుకు వచ్చినప్పుడు ప్రజలు ఎక్కడికి అక్కడ అడ్డం తిరుగుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వరావుపేట మండలంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్ నందు భూమాత అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించి వెళ్లిపోయిన సందర్భంలో.. అక్కడికి చేరుకున్నటువంటి గుర్రాల చెరువు గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున మాకు ఇల్లు రాలేదు మేం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారమంటూ గట్టిగా నిలదించారు. మంత్రి ని కలవడానికి వెళదామనుకుంటే పోలీసులు అడ్డుపడుతున్నారని, ఇదెక్కడి అన్యాయమని లబోదిబోమంటూ మొత్తుకున్నారు. పేద వారం.. కటిక ఇల్లు లేనటువంటి వారం, మాకు రావలసినటువంటి ఇల్లు కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు పేరు డబ్బు ఉన్నటువంటి వారికే ఇల్లు మంజూరు చేశారని అర్హత కలిగినటువంటి మాకు ఇల్లు మంజూరు చేయలేదని దయగల పొంగులేటి సారును కలవడానికి వచ్చిన పోలీసులు అడ్డుకున్నారని ఇదెక్కడి న్యాయమని లబోదిబోమంటూ గోల పెట్టారు. గోలను సైతం అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. అరిసి అరిసి విసిగి వేసారి పోయి వెళ్ళిపోయారు. ఒక్కొక్క గ్రామాలలో ఒక్కొక్క తీరుగా ఇందిరమ్మ కమిటీ వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు పట్టి పట్టనట్టు ఉండటం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. జర ఉన్నతాధికారులు దృష్టి పెట్టి నిజమైన అర్హత కలిగినటువంటి లబ్దిదారులకు మంత్రి చెప్పిన విధంగా పేదవారికి గూడు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.





# భూ భారతిలో ప్రతీ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం : మంత్రి పొంగులేటి





అశ్వారావుపేట, ఏప్రిల్ 28 తొలి క్రాంతి :భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడమే లక్ష్యంగా రూపొందించిన భూ భారతి – 2025 చట్టం రైతులకు శ్రీరామరక్షగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.సోమవారం అశ్వారావుపేట మండలంలోని శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి, రైతులతో చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ — భూ భారతి చట్టం రూపొందించే ముందు రైతుల కష్టాలను అర్థం చేసుకోవడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.ఆ కమిటీ చేసిన సూచనలను పరిగణలోకి తీసుకొని, రైతులకు భద్రత కల్పించేలా ఈ చట్టాన్ని రూపొందించామని వివరించారు.గతంలో నాలుగు గోడల మధ్య, నలుగురి ప్రయోజనాల కోసం రూపొందించిన ధరణి చట్టానికి విమర్శలు ఎదురయ్యాయని, ధరణి చట్టం అమలులో మూడేళ్లు గడిచినా స్పష్టమైన నిబంధనలు రూపొందించలేదని ఆయన విమర్శించారు.భూ భారతి చట్టంలోని ముఖ్యాంశాలు:రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో ప్రథమ విడత ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నట్టు తెలిపారు.అన్ని దరఖాస్తులు, సమస్యల వివరాలను సేకరించి జూన్ 2 నాటికి వీలైనన్ని సమస్యలను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.అర్హులైన రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పట్టాలుగా ఇవ్వనున్నారు.ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు వివరించారు.భూ సమస్యల పరిష్కార ప్రక్రియ:భూ యజమానులకు న్యాయం జరిగేలా తహసీల్దార్ స్థాయి నుంచి సీసీఎల్ఎ వరకు ఐదు స్థాయిల వ్యవస్థ ఏర్పాటు చేశారు.సీసీఎల్ఎ వద్ద న్యాయం జరగని పక్షంలో ట్రిబ్యునల్ ఆశ్రయించే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చారు.రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైనన్ని ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు.అధికార వ్యవస్థ పారదర్శకత:రాబోయే నెల 10వ తేదీకి రెవెన్యూ మరియు గ్రామ పరిపాలనాధికారులు ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.తప్పుచేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గతంలోని అవకతవకలపై వ్యాఖ్యలు:"రైతు బంధు" పథకం అమలులో గులాబీ రంగు కార్యకర్తలకు భూములు లేకపోయినా పాస్‌పుస్తకాలు ఇచ్చారని ఆరోపించారు.ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజా పాలనలో పారదర్శకత, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి స్పష్టం చేశారు.ఏ పార్టీకి చెందినవారైనా రైతులుగా గుర్తించి, వారికి న్యాయం చేసే విధంగా రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తుందని, పక్షపాతం లేకుండా అందరికీ సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.ఈ కార్యక్రమంలో:ఎమ్మెల్యే జారే ఆదినారాయణ,జిల్లా కలెక్టర్ వి. జితీష్ పాటిల్,ఎస్పీ రోహిత్ రాజు,ఇతర జిల్లా అధికారులు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మ రాంబాబు,నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, సుంకవల్లి వీరభద్రరావు, చెన్నకేశవరావు, జి. సత్యనారాయణ చౌదరి,వివిధ గ్రామాల నాయకులు, కార్యదర్శులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# పటాన్చెరులో 12 కోట్లతో ఇండోర్ సబ్ స్టేషన్

**- నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా -**
**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.- సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన**

పటాన్చెరు, ఏప్రిల్ 28 తొలిక్రాంతి : పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పెరుగుతున్న జనాభాకు అణుగుణంగా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్న సమున్నత లక్ష్యంతో నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరువు పట్టణంలో 12 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కెవి ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.పటాన్చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో 12 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన 33/11 కెవి ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా పటాన్చెరువు పట్టణంలో ఇండోర్ సబ్స్టేషన్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. పాశమైలారం నుండి నేరుగా నూతన సబ్ స్టేషన్ కి ప్రత్యేక లైను వేయడంతో పాటు పటాన్చెరు, రామచంద్రాపురం పట్టణాలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్ లో 100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 132 కెవి సబ్స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు ఎంపీడీవో యాదగిరి, విద్యుత్ శాఖ ఏ డి ఈ లు సంజీవ్, నాగరాజు, రవికాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నివర్తి దేవ్, అంతిరెడ్డి, అంజిరెడ్డి, గోపాల్ రెడ్డి, షకీల్, ఐలేష్, హమీద్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





తొలిక్రాంతి
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
మంగళవారం
29 ఏప్రిల్ 2025

## 30న హెడ్ ఆఫీస్ వద్ద మహా ధర్నా - విజయవంతం చేయండి

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచాలని, కోలిండియా జీతాలు అమలు చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నేతలు బి మధు, కరుణాకర్, యాకయ్య, గోపాలరావు, సురేందర్ లు డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల పెంపుదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ చూపాలని, మేడేకి ముందు జీతాల పెంపు ప్రకటించాలని కోరారు.జీతాల పెంపు లేకపోతే మేడే తరువాత ఉధృతమైన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 30న సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద ఉదయం నుండి సాయంత్రం వరకు మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీన్ని జయప్రదం చేయాలని కోరారు.జేఏసీ నాయకులు భూక్య రమేష్, జాటోత్ కృష్ణ, అనిల్, రవి, సక్రాం, సంజీవ్, శేఖర్, రాజేష్, పద్మ, భాస్కర్, బన్ను, బాబురావు తదితరులు కార్యక్రమాన్ని సమన్వయిస్తున్నారు.




## బీఆర్ఎస్ రజతోత్సవ విజయోత్సవం: మణుగూరు గులాబీ శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు

మణుగూరు, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను ఘనంగా విజయవంతం చేసిన మణుగూరు సింగరేణి గులాబీ శ్రేణులకు మణుగూరు ఏరియా టి.బి.జి.కె.యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.టి.బి.జి.కె.యస్ గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మార్గదర్శకత్వంలో, భద్రాద్రి కొత్తగూడెం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు నాయకత్వంలో, రాష్ట్ర టి.బి.జి.కె.యస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ పిలుపు మేరకు మణుగూరు టి.బి.జి.కె.యస్ నాయకులు, కార్యకర్తలు మరియు కూనవరం పంచాయతీ బీఆర్ఎస్ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా బీఆర్ఎస్ పార్టీ మరియు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాల పిలుపులను విజయవంతం చేయడానికి ప్రతి గులాబీ సైనికుడు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని నాగెల్లి వేంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.



## పహల్గామ్ ముష్కరులకు బహిరంగంగా ఉరి తీయాలి: జహీర్ అలీ

ఖమ్మం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి: కాశ్మీర్ పహల్గామ్ లో అమాయక పర్యాటకులను హతమార్చిన ముష్కరులను బహిరంగంగా ఉరితీయాలని సీనియర్ న్యాయవాది మహమ్మద్ జహీర్ అలీ డిమాండ్ చేశారు. ఈ హత్యలు మానవత్వానికి మాయని మచ్చగా మిగిలి పోతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాశ్మీర్ పర్యాటక రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆందోళన తెలిపారు. ఉగ్రవాదులను తక్షణమే పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని, భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, సైన్యానికి ఆధునిక ఆయుధాలు అందించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. దేశ భద్రత కోసం ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని సూచించారు.





## రాజ్యాంగ వ్యతిరేక వక్ఫ్ సవరణ చట్టం రద్దు వరకు ఉద్యమం కొనసాగించాలి: ఖమ్మం ముస్లిం పర్సనల్ లా బోర్డు

ఖమ్మం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:రాజ్యాంగానికి వ్యతిరేకమైన వక్ఫ్ సవరణ చట్టం 2025ను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగించాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఖమ్మం యూనిట్ నిర్ణయించింది. మదర్ సే దారుల్ ఉలుమ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మౌలానా మొహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాష్మీ మాట్లాడారు. తొలి దశ ఉద్యమం విజయవంతమైన నేపథ్యంలో, రెండవ దశ కార్యాచరణను కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ నెల 30వ తేదీన రాత్రి 9:00 నుంచి 9:10 వరకు ఇళ్లలో కరెంట్ నిలిపివేయాలని సూచించారు. మసీదుల ఇమాములు, బాధ్యులు సమావేశానికి హాజరై సలహాలు, సూచనలు ఇచ్చారు. సాధారణ ప్రజలకు వక్ఫ్ ప్రాముఖ్యతను వివరించే కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. చట్టం రద్దు అయ్యే వరకు నిరంతర ఉద్యమంలో పాల్గొనాలని ప్రతిజ్ఞించారు.



# ఖమ్మం నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణ

ఖమ్మం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. మంత్రి, వర్షాకాలం లోపు మురుగు నీటి పైప్ లైన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.అమృత్ 2.0 పథకంలో 189.5 కోట్ల రూపాయలతో భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ నిర్మాణం జరుగుతోంది. ధంసలాపురం మరియు పుట్టకోటలో మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించవస్తున్నారు.మరియు, పనుల పూర్తి చేయడంలో ఎలాంటి ఆలస్యాన్ని అనుమతించకుండా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.











## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం/నేలకొండపల్లి, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోంది. ఇటీవల నేలకొండపల్లి మండలం అనాసాగరం, మంద్రాజుపల్లి, చందాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, 152 దరఖాస్తులు స్వీకరించారు.తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్ లు మాట్లాడుతూ, భూ భారతి చట్టం ద్వారా లావాదేవీలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వంటి సేవలు సులభతరం అవుతాయని, రైతులకు ఉచిత న్యాయ సహాయం కూడా అందుతుందని తెలిపారు.ఈ చట్టం ద్వారా భూదార్ కార్డుల జారీ, భూకేట్టును సరిచేసే అవకాశం ఉంది.

## ప్రభుత్వ కార్యాలయాలకు కంప్యూటర్స్, ప్రింటర్స్ సరఫరా

ఖమ్మం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు 39 డెస్క్ టాప్ కంప్యూటర్స్, 3 ల్యాప్ టాప్ లు, 4 ప్రింటర్స్, 2 ప్రొజెక్టర్స్, 1 జిరాక్స్ మిషన్ సరఫరా కోసం టెండర్లు ఆహ్వానించినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఆసక్తి గల వారు 3 లక్షల రూపాయల ఈ.ఎం.డి. తో టెండర్ ఫారం 5 వేల రూపాయలు చెల్లించి పొందవచ్చని, మే 9లోపు దాఖలు చేయాలని సూచించారు. టెండర్లు మే 13న మధ్యాహ్నం 3 గంటలకు ఓపెన్ చేయబడతాయని పేర్కొన్నారు.

## భూ భారతి చట్టం –రైతుల మేలు కోసం చారిత్రక మార్పు

### ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

### సత్తుపల్లిలో అవగాహన సదస్సు

సత్తుపల్లి, ఏప్రిల్ 28 తొలి క్రాంతి: ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాఘమయి, ఇతర ప్రముఖులు 2025లో ప్రవేశపెట్టిన తెలంగాణ భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులో పాల్గొన్నారు.రామసహాయం రెడ్డి మాట్లాడుతూ, గతంలో ధరణి చట్టం రైతులను కష్టాల్లో పెట్టిందని, కానీ ఇప్పుడు కొత్త భూ భారతి చట్టం ద్వారా రైతుల హక్కులు రక్షించబడుతాయని అన్నారు. చట్టం ప్రకారం ప్రతి భూమికి ప్రత్యేక నెంబర్ కేటాయించి, భూధార్ కార్డును ఆధార్ కార్డు మాదిరిగా తీసుకోవచ్చని చెప్పారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కరించేందుకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి, గ్రామాల్లో సర్వేయర్లు నియమించనట్లు తెలిపారు. అలాగే, భూ హక్కుల రికార్డుల్లో తప్పులు ఉంటే, రెవెన్యూ కోర్టుల ద్వారా అప్పీల్ చేయవచ్చని పేర్కొన్నారు.డాక్టర్ మట్టా రాఘమయి మాట్లాడుతూ, పూర్వ ప్రభుత్వం ద్వారా తీసుకొచ్చిన ధరణి చట్టం రైతులకు నష్టం చేసిందని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ద్వారా తీసుకొచ్చిన భూ భారతి చట్టం రైతులకు అనుకూలంగా ఉందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.










## ఖమ్మంలో కేంద్ర ప్రభుత్వ పథకాల సమీక్ష : ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, సోమవారం జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.రామసహాయం రఘురాం రెడ్డి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు మౌళిక వసతులు కల్పించే విషయంలో నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. సమీక్షలో, ఆయన అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, 6 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం అందించే సూచనలతో పాటు, పిఎం.ఈ.జి.పి. పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు లాభాలు చేకూర్చాలని కోరారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఆడపిల్లల పుట్టిన రోజుల్లో పండుగ వాతావరణం సృష్టించడం, దివ్యాంగుల కోసం అనుకూలమైన వసతులు కల్పించడం గురించి వివరించారు.వైరా శాసన సభ్యుడు రాందాస్ నాయక్, రోడ్డు వైడ్నింగ్ మరియు సెంట్రల్ లైటింగ్ పై సూచనలు చేశారు.ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఆర్డీవో సన్యాసయ్య, జెడ్పీ సిఇఓ దీక్షా రైనా, తదితర అధికారులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారం...

### సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి

సత్తుపల్లి, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:భూ భారతి చట్టం–2025తో భూ సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి తెలిపారు. సోమవారం వేంసూరు మండలంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. రాగమయి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్ పాల్గొని, భూ హక్కుల చట్టం వివరించారు.ఈ సందర్భంగా, "గత ప్రభుత్వం ధరణి చట్టంతో రైతులను ఇబ్బందులకు గురిచేసింది. ప్రజా ప్రభుత్వంలో కొత్త చట్టం తీసుకుని వచ్చాం," అని అన్నారు. ఈ చట్టం ప్రకారం, భూ హక్కుల రికార్డులపై అభ్యంతరాలు ఉంటే, రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా కలెక్టర్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చు.భూ హక్కుల కోసం ఉచిత న్యాయ సలహా అందిస్తామని, భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా న్యాయబద్ధంగా జరుగుతుందని తెలిపారు. భూముల సర్వే, మ్యాప్ తయారీ తప్పనిసరి అని చెప్పారు. భవిష్యత్తులో ప్రతి భూమికి భూ దార్ కార్డు ఇచ్చే అవకాశం ఉంటుందని కూడా వెల్లడించారు.ఈ కార్యక్రమంలో, మార్కెట్ చైర్మన్ దోమ ఆనందబాబు, వేంసూరు తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.








## మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ

ఖమ్మం, ఏప్రిల్ 28 తొలి క్రాంతి:తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రచార పోస్టర్లు సోమవారం ఖమ్మంలో ఆవిష్కరించబడ్డాయి. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ చెప్పారు, ఈ పాఠశాలలు మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తు కోసం కీలకమైన సంస్థలుగా పనిచేస్తున్నాయి. పోస్టర్లు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రదర్శించమని సూచించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక అగస్త్య, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.